
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

శనివారం 10 ఆగస్టు 2024



కలెక్టర్‌కు జెండా ఆవిష్కరించే అవకాశం

పాడేరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న పాడేరులో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించాలని, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్టీఆర్ జిల్లాలో సీఎం చంద్రబాబునాయుడు, కాకినాడ జిల్లాలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మిగిలిన జిల్లాల్లో మంత్రులు మాత్రమే జాతీయ జెండాను ఆవిష్కరించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాత్రం ఆ అవకాశాన్ని జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు కల్పించింది.

ఆదివాసీలే అసలైన మానవతావాదులు

కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్

- అడవి బిడ్డల అభివృద్ధికి చర్యలు చేపడతామని ప్రకటన
- పాడేరులో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

పాడేరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో మనం భాగం మాత్రమేనని, పర్యావరణాన్ని కాపాడే ఆదివాసీలే అసలైన మానవతావాదులని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. పాడేరులో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సామాజిక అవసరాలు గిరిజనులకు తెలిసినట్టుగా ఎవరికీ తెలియవని, ఆ విషయంలో వారిని చూసి నేర్చుకోవాలన్నారు. అలాగే మానవత్వం గురించి ప్రపంచ స్థాయిలో చర్చ జరిపినప్పుడు పర్యావరణాన్ని ఎవరు పరిరక్షిస్తున్నారో వారే మానవతావాదులని నిర్ణయించారన్నారు. అడవుల్లో జీవించే ఆదివాసీలు అమాయకులు కాదని, మైదాన ప్రాంతాల్లోని గిరిజనులు అమాయకులని కలెక్టర్ పేర్కొన్నారు. ఆదివాసీల హక్కులు రక్షించాలని, షెడ్యూలు 5 నిబంధనలు పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ నెలలో మార్గదర్శి అనే కార్యక్రమాన్ని అమలు చేసి గిరిజన విద్యార్థులను చైతన్య పరుస్తామన్నారు. ఇప్పటికీ ఏజెన్సీలో సుమారుగా 950 గ్రామాలకు రోడ్లు లేవని, రానున్న మూడేళ్లలో రోడ్లు, వంతెనల నిర్మాణానికి చర్యలు చేపడతామని చెప్పారు. గిరిజనులకు మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అందరి సూచనలు, సలహాలు, సమాచారం సేకరించి ఐటీడీఏ స్థాయిలో 'విజన్ స్టేట్‌మెంట్' రూపొందిస్తున్నామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పని చేసే అవకాశం వచ్చిందని, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ గిరిజనులకు తమ హక్కులు, చట్టాలపై అవగాహన ఉండాలని, కలెక్టర్ ఆదేశాలతో పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. ఉపాధ్యాయులు ఒక గంట అదనపు క్లాస్ తీసుకుని విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఏజెన్సీ ముఖ ద్వారం వద్ద సింహ ద్వారం నిర్మిస్తామన్నారు. ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర, దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సమరెడ్డి మాణిక్యం ఆదివాసీల హక్కులపై మాట్లాడారు.



విల్లు ఎక్కుపెట్టిన కలెక్టర్ దినేశ్‌కుమార్, అడ్డాకుల గిడుగులు ధరించిన జేసీ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్



మహిళలతో థింసా నృత్యం చేస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, జేసీ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్

అలరించిన గిరి విద్యార్థుల ప్రదర్శనలు

ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందర్నీ అలరించాయి. అరకులోయ మండలం చొంపి గ్రామం గిరిజనులు చేసిన థింసా నృత్యం ఆకట్టుకుంది. వీడీవీకే, ప్రకృతి వ్యవసాయంపై స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముందు స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు, గాం మల్లుదొర, గంటం దొర, భగవాన్ బిర్సాముండా తదితరుల విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి కలెక్టర్, తదితరులు నివాళులర్పించారు. అనంతరం ఆదర్శ కాఫీ రైతులు కూడా పోతురాజు (దొడ్డిపల్లి), కొర్రా వెంకటరావు (గుర్రగరువు), పాంగి మహేశ్, వి.బొంజుబాబు(గొడ్డుమామిడి), అంతర్జాతీయ కాఫీ అవార్డు గ్రహీత కిల్లో అశ్విని(కప్పాడ), తదితర కాఫీ రైతులను అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వీఎస్ ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, డీఆర్‌వో బీ.పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ ఐ.కొండలరావు, టీడబ్ల్యూ ఎస్‌డీసీ వీవీఎస్ శర్మ, డీఎంహెచ్‌వో జమాల్ బాషా, పశు సంవర్ధక శాఖ డీడీ నరసింహులు, ఆర్ అండ్ బీ ఈఈ బాల సుందరబాబు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, ఎల్‌డీఎం నాయుడు , వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధి హామీతో హరిత విప్లవం

ఒకే రోజు 5 లక్షల మొక్కలు నాటారు

- ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వినూత్న కార్యక్రమం
- ఉపాధి హామీ అధికారులు, సిబ్బందికి ఐటీడీఏ పీవో అభినందనలు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనులకు ఉపయోగపడే ఒక వినూత్నమైన పని చేయాలని ఐటీడీఏ పీవో అభిషేక్, ఉపాధి హామీ పథకం అధికారులు భావించారు. ఇందులో భాగంగా ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఒక్క రోజే ఏజెన్సీ వ్యాప్తంగా 5 లక్షల మొక్కలను నాటించారు. అందుకు కృషి చేసిన ఉపాధి హామీ పథకం ఏపీడీ కటారి శ్రీనివాసరావు, సిబ్బందిని ఐటీడీఏ పీవో అభిషేక్ అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కల పెంపకం చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జూలై, ఆగస్టు నెలల్లో వాటిని రైతుల ద్వారా నాటించాలని సూచించింది. ఐటీడీఏ, ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది గ్రామాల్లో సభలు నిర్వహించి, గిరిజనులకు అవసరమైన మొక్కల వివరాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా కాఫీ తోటలకు నీడనిచ్చే సిల్వర్ ఓక్, ఇతర నీడ, పండ్ల మొక్కలను పంపిణీ చేయాలని గిరి రైతులు కోరారు. వారి అవసరాలకు అనుగుణంగా అధికారులు ఆయా మొక్కలను రప్పించి గత వారం రోజులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే వాటిని నాటేందుకు గోతులు సిద్ధం చేసుకుని, ఆదివాసీ దినోత్సవం నాడు అందరూ ఆయా మొక్కలను నాటాలని అధికారులు రైతులకు సూచించారు.



అరకులోయలో శుక్రవారం మొక్కలు నాటుతున్న రైతులు



రైతులకు మొక్కలు అందిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

వినూత్న కార్యక్రమం

ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని ఏజెన్సీ వ్యాప్తంగా శుక్రవారం ఒక్క రోజే 5 లక్షల మొక్కలను గిరిజన రైతులు నాటారు. ఏజెన్సీలో అనంతగిరి మండలంలో 61 మంది రైతులు 64 ఎకరాల్లో 33,600 సిల్వర్ ఓక్, 1,120 జీడిమామిడి మొక్కలను నాటారు. అరకులోయ 51 మంది రైతులు 51 ఎకరాల్లో 24,500 సిల్వర్ ఓక్, 960 జీడి మొక్కలు, చింతపల్లిలో 163 మంది రైతులు 164 ఎకరాల్లో 1,13,400 సిల్వర్ ఓక్, 400 జీడి మొక్కలు, డుంబ్రిగుడలో 58 మంది రైతులు 58 ఎకరాల్లో 40,600 సిల్వర్ ఓక్ మొక్కలు, జి.మాడుగులలో 50 మంది రైతులు 50 ఎకరాల్లో 35,000 సిల్వర్ ఓక్ మొక్కలు, జీకేవీధిలో 80 మంది రైతులు 80 ఎకరాల్లో 56,000 సిల్వర్ ఓక్ మొక్కలు, హుకుంపేటలో 76 మంది రైతులు 76 ఎకరాల్లో 53,200 సిల్వర్ ఓక్, కొయ్యూరు మండలంలో 137 మంది రైతులు 137 ఎకరాల్లో 25,900 సిల్వర్ ఓక్, 5,250 జీడి, 840 కొబ్బరి, 660 ఆయిల్ పామ్ మొక్కలు, ముంచంగిపుట్టు మండలంలో 53 మంది రైతులు 53 ఎకరాల్లో 37,100 సిల్వర్ ఓక్ మొక్కలు, పాడేరులో 50 మంది రైతులు 50 ఎకరాలలో 35,000 సిల్వర్ ఓక్ మొక్కలు, పెదబయలు మండలంలో 50 మంది రైతులు 50 ఎకరాల్లో 35,000 సిల్వర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజన రైతులు ఒకే రోజు 5 లక్షల మొక్కలను నాటడం అభినందనీయమని, అందుకు కృషి చేసిన ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. గిరిజన రైతులు వాటిని సంరక్షించుకోవాలన్నారు.

సకాలంలో వైద్యం అందక తల్లి, బిడ్డ మృతి

- చింతపల్లి ఆస్పత్రిలో గైనికాలజిస్టు, ఎనస్థీషియన్ అందుబాటులో లేకపోవడంతో ప్రసవ వేదనతోనే 60 కిలోమీటర్లు ప్రయాణం
- ఆదివాసీ దినోత్సవం రోజున ఏజెన్సీలో విషాదం

గూడెంకొత్తవీధి, ఆగస్టు 9: ఆదివాసీ దినోత్సవం వేళ ఏజెన్సీలో విషాదం నెలకొంది. నిండు గర్భిణికి సకాలంలో వైద్య అందకపోవడంతో తల్లి, శిశువు మృతి చెందారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ ఊబపాలెం గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి మృతురాలి భర్త కృష్ణ, తల్లిదండ్రులు బంగారం, భానుమతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వంతల పరిమళ (21)కు నెలలు నిండడంతో గురువారం సాయంత్రం నొప్పులు వచ్చాయి. దీంతో ఆమెను అంబులెన్సులో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆస్పత్రిలో గైనికాలజిస్టు అందుబాటులో లేరు. సిజేరియన్ అవసరమని వైద్యులు గుర్తించారు. చింతపల్లి ఆస్పత్రిలో గైనికాలజిస్టు, ఎనస్థీషియన్ అందుబాటులో లేకపోవడంతో పరిమళను అంబులెన్స్‌లో 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి వైద్యులు పరిమళకు సహజ కాన్పు చేశారు. అయితే శిశువు కడుపులోనే మృతిచెందింది. తల్లి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నదని శుక్రవారం తెల్లవారుజామున విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే పరిమళ తుదిశ్వాస విడిచింది. దీంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివాసీ దినోత్సవం రోజే తల్లి, శిశువు మరణించడంతో ఊబపాలెం గ్రామ గిరిజనులు విషాదంలో మునిగిపోయారు. చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో గైనికాలజిస్టు, ఎనస్థీషియన్ అందుబాటులో లేకపోవడం వల్లే తన బిడ్డ మృతి చెందిందని మృతురాలి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



సకాలంలో వైద్యం అందక మృతిచెందిన పరిమళ

ఎమ్మెల్సీ ఎన్నికపై కూటమి కసరత్తు

తేలని అభ్యర్థి

సీఎంతో ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు, నేతల సమావేశం

- గెలుపు ఖాయమన్న కొందరు... పోటీకి దూరంగా ఉంటే మంచిదన్న మరికొందరు
- పోటీ/అభ్యర్థి ఎంపికపై ఆరుగురితో కమిటీ ఏర్పాటు

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఎంపిక ఇంకా కొలిక్కిరాలేదు. శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు, నాయకుల సమావేశం జరిగింది. నేతల అభిప్రాయాలు తెలుసుకున్న అనంతరం ఉమ్మడి జిల్లాలో పార్టీల బలాబలాలపై చంద్రబాబు నాయుడు చర్చించారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించామని, అదే ఊపుతో ఎమ్మెల్సీ పదవిని గెలుచుకుంటామని కొందరు నాయకులు చెప్పారు. అభ్యర్థి ఎవరైనా గెలుస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే వైసీపీకి చెందిన చాలామంది సభ్యులు కూటమికి మద్దతు తెలిపారని వివరించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను వైసీపీ ఉత్తర భారతదేశ యాత్రకు తీసుకువెళ్లిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అయితే వైసీపీతో పోల్చితే కూటమికి తక్కువ ఓట్లు ఉన్నాయని పేర్కొంటూ పోటీకి దూరంగా ఉంటే మంచిదని మరికొందరు అభిప్రాయపడ్డారు. దీంతో నేతలంతా మరోసారికూర్చుని పోటీ/అభ్యర్థిపై తేల్చాలని అధినేత సూచించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలుసుకుని తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్‌బాబు, విష్ణుకుమార్‌రాజులతో కమిటీని ఏర్పాటుచేశారు. సీఎంతో సమావేశానికి పల్లా శ్రీనివాసరావు, హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, విష్ణుకుమార్‌రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, సుందరపు విజయకుమార్, విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు గండి బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా నాగజగదీశ్వరరావు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, తదితరులు హాజరయ్యారు. ఇదిలావుండగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ నుంచి పోటీ చేయడానికి తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జీ, పీలా గోవింద సత్యనారాయణ, మాడుగుల నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, బత్తుల తాతయ్యబాబు సిద్ధంగా ఉన్నారు. ఇంకా బైరా దిలీప్ చక్రవర్తి పేరు కూడా పరిశీలనలో ఉంది.

పెదలోచలి హెచ్ఎం సస్పెన్షన్

ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

- విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు చర్యలు

- 8లో

క్రైం... crime news

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు

» క్లీనర్ మృతి » 12 మంది లారస్ ఉద్యోగులకు గాయాలు


ప్రమాదంలో నుజ్జయిన బస్సు ముందుభాగం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

అచ్యుతాపురం, ఆగస్టు 9: ఆగి ఉన్న లారీని సెజ్‌లోని ఓ కర్మాగారానికి ఉద్యోగులను తీసుకువెళుతున్న బస్సు ఢీకొనడంతో క్లీనర్ మృతి చెందగా, 12 మంది ఉద్యోగులు గాయాలకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు ఎస్.రాయవరం మండలం నుంచి సెజ్‌లో గల లారస్-4 కర్మాగారానికి బి-షిఫ్టు నిమిత్తం ఉద్యోగులను శుక్రవారం తీసుకు వస్తోంది. రాంబిల్లి మండలం వెంకటాపురం జంక్షన్ దాటి లంకధర్మవరం రోడ్డు వద్దకు వచ్చేసరికి ఎదురుగా ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొంది. దీంతో బస్సు ఎడమభాగం నుజ్జయింది. క్లీనర్ పెంటకోట రమణ తీవ్రగాయాలకు గురయ్యాడు. అనకాపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. అలాగే ఈ ఘటనలో మరో 12 మందికి గాయపడగా, ఇందులో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరికి అచ్యుతాపురంలోని ఓ ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి తీవ్రంగా గాయపడిన వారిని అనకాపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బస్సులో ఉన్న ఉద్యోగులు తెలిపారు. ఇదిలావుంటే, మృతిచెందిన క్లీనర్ పెంటకోట రమణ కుటుంబానికి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. ఇక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

పనోరమ హిల్స్‌లో భారీ చోరీ

» 30 తులాల బంగారం, రూ.10 లక్షల నగదు అపహరణ

» గురువారం రాత్రి ఘటన?


చెల్లాచెదురుగా పడి వున్న వస్తువులు

ఎండాడ, ఆగస్టు 9: ఎండాడ పనోరమ హిల్స్‌లోని ఓ విల్లాలో భారీ చోరీ జరిగింది. సుమారు 30 తులాల బంగారం, రూ.10 లక్షల నగదు అపహరణకు గురైనట్టు పీఎం పాలెం పోలీసులు తెలిపారు. వారు చెప్పిన వివరాలు ప్రకారం...పనోరమ హిల్స్‌లో (విల్లా నంబర్ 43 ఏ) అపోలో హాస్పిటల్ వైద్యుడు కె. వెంకటేశ్వరరావు, ఆయన సతీమణి కేజీహెచ్ వైద్యురాలు సంధ్యాదేవి కొన్నేళ్లగా నివాసం ఉంటున్నారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో భీమవరం బయలుదేరి వెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం తిరిగి వచ్చేసరికి ఇంట్లో సామగ్రి అంతా చిందరవందరగా పడేసి ఉంది. చోరీ జరిగినట్టు గుర్తించి పీఎం పాలెం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు క్లూస్ టీమ్‌తో విల్లాకు చేరుకున్నారు. సీసీ ఫుటేజ్‌ను పరిశీలించడంతో పాటు సెక్యూరిటీని, స్థానికులను విచారించారు. చోరీలో సుమారు 30 తులాల బంగారం, 10 లక్షల నగదు అపహరణకు గురైనట్టు పోలీసులు చెబుతున్నారు. గురువారం రాత్రి ఈ సంఘటన జరిగినట్టు భావిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నేర పరిశోధన విభాగం ఏడీసీపీ మహేష్, ఏసీపీ వెంకట్రావు, సీఐ రాంబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా అత్యధిక భద్రత ఉండే విల్లాలో దొంగతనం జరగడంతో అక్కడ నివాసం ఉంటున్నవారు భయాందోళన చెందుతున్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్


పట్టుబడిన వాహనాలను స్టేషన్‌కు తరలించిన దృశ్యం

సబ్బవరం, ఆగస్టు 9 : మండలంలోని అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి మైనింగ్ రాయల్టీ అధికారిణి స్వాతి తెలిపిన వివరాలివి. రాయపుర అగ్రహారంలో శుక్రవారం ఓ ప్రైవేటు స్థలం నుంచి వేరొక చోటుకు యంత్రం ద్వారా మట్టిని తవ్వి తరలిస్తున్నట్టు తమకు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు గ్రామానికి వెళ్లి పరిశీలించగా, ఎక్సకవేటర్‌తో మట్టి తవ్వి ఐదు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వాటిని స్థానిక పోలీసు స్టేషన్‌కు తలించినట్టు చెప్పారు. అక్రమంగా గ్రావెల్ తరలించినవారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

ప్రభుత్వ భూముల్లో షెడ్లు తొలగింపు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 9: కొండెంపూడి శివారు అయ్యిరెకలపాలెంలో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా వేసిన షెడ్లను శుక్రవారం తొలగించినట్టు హెచ్‌డీటీ అరుణ్‌చంద్ర తెలిపారు. సర్వే నెంబరు 5, 5/2లో సుమారు ఏడు ఎకరాల ప్రభుత్వ బంజరులో ఇద్దరికి డీపారం పట్టాలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అయితే ఈ భూములను కొందరు అన్యాక్రాంతం చేసినట్టు స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు చేసిన దర్యాప్తు చేశామన్నారు. ఈ నేపథ్యంలో టీఓటీ యాక్టు ప్రకారం ఈ ప్రభుత్వ భూముల్లో షెడ్లను పోలీసు బందోబస్తుతో తొలగించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామని అరుణ్‌చంద్ర వివరించారు.

'ఆదివాసీల చట్టాలను పరిరక్షించుకుందాం'



ఆదివాసీ గిరిజన వారోత్సవాల్లో పాల్గొన్న సంఘం నాయకులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 9 : ఆదివాసీల మనుగడ కోసం రూపొందించిన చట్టాలను పరిరక్షించుకుందాం అని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు పిలుపు నిచ్చారు. ప్రపంచ ఆదివాసీ హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఎంవీపీ కాలనీలోని గిరిజన్ భవన్‌లో శుక్రవారం వారు జెండా ఎగురవేసి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంబిడి కోటీశ్వరరావు మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ వెనుకబడిన ఆదివాసీలు సమష్టిగా పోరాడి తమ రక్షణ కోసం తెచ్చుకున్న చట్టాలను కాపాడుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ గిరిజన వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ తమను తీవ్రంగా నష్టపరుస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విశ్వవిద్యాలయం నెలకొల్పుతామని హామీ ఇచ్చినా, నెరవేర్చలేదన్నారు. ఈ కార్య క్రమంలో సంఘం నాయకులు రూడ సత్యారావు, డిప్పల సాంబమూర్తి, సరమండ గీత, కొప్పు చిట్టిబాబు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	78.00
లైవ్ ధర	98.00
విత్ స్కిన్	166.00
స్కిన్ లెస్	176.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

ఉన్నత లక్ష్య సాధనే ధ్యేయం కావాలి

» జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

» ఘనంగా ఆదివాసీ దినోత్సవం


విద్యార్థినులతో కలెక్టర్ విజయకృష్ణన్

మాడుగుల రూరల్, ఆగస్టు 9: విద్యార్థులంతా క్రమశిక్షణతో ఉన్నత లక్ష్య సాధనకు కృషి చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని తాటిపర్తి ట్రైబల్ వెల్ఫేర్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి బాగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. యుక్త వయస్సులో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా చదువుపైనే దృష్టిసారించాలన్నారు. ముందుగా కలెక్టర్‌ని విద్యార్థినుల థింసా నృత్యాలతో సాదరంగా స్వాగతం పలికారు. గిరిజనులు జీవన విధానంలో వినియోగించే మట్టిపాత్రలు, వివిధ రకాల చిరుధాన్యాలతో తయారు చేసిన పలు వంటకాలు, తదితర స్టాల్స్‌ని పరిశీలించారు. విద్యార్థులు రూపొందించిన పలు ప్రయోగాలను తెలుసుకుని అభినందించారు. అనంతరం సభ కలెక్టర్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఆదివాసీ పోరాటయోధుల చిత్రపటాలకునివాళులర్పించారు. అనంతరం ఆదివాసీల ఆడ్డాకుల టోపీని కలెక్టర్ ధరించి డంకా మోగించారు. విల్లు ఎక్కుపెట్టి ఆదివాసీ సంస్కృతిని అభినందించారు. విద్యార్థినుల ఆలపించిన గేయాలు, నృత్య ప్రదర్శనలు అలరించాయి. వివిధ ట్రైబల్ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మెమొంటో అందజేసి వారిని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కలెక్టర్‌ని సత్కరించారు.

గ్రామాలను షెడ్యూల్ జాబితాలో చేర్చాలి

ఈ సందర్భంగా ఆదివాసీ సంఘం నాయకులు నల్లి కల్యాణం అనకాపల్లి జిల్లాలో నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న ఆదివాసీలకు షెడ్యూల్ జాబితాలో చేర్పించి తగు న్యాయం చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. హెచ్‌ఎం రమాదేవి మాట్లాడుతూ పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన అదనపు తరగతి భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయించాలని కలెక్టర్‌కి విన్నవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగ శిరీష, తహసీల్దారు పీవీ రత్నం, ఎంపీడీవో కాళీ ప్రసాద్, వార్డెన్ ఉమా మహేశ్వరి, ఉపాధ్యాయ సిబ్బంది, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బంజరు భూమిపై రెండు గ్రామాల మధ్య వివాదం

» పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 9: బంజరు భూమిపై రెండు గ్రామాల మధ్య నెలకొన్న వివాదంతో శుక్రవారం మండలంలో ఉద్రికత్త పరిస్థితులకు దారి తీసింది. స్థానిక ఎస్‌ఐ డి.ఈశ్వరరావు అందించిన వివరాలి.. ఎల్.సింగవరం సర్వే నంబరు 60లో ప్రభుత్వ బంజరు భూమి 30 ఎకరాలను 40 ఏళ్లుగా కొండెంపూడికి చెందిన 20 కుటుంబాలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. శుక్రవారం ఎల్.సింగవరానికి చెందిన వేపాడ మధు, రేణం బాలకృష్ణ, వేపాడ కొండయ్య, వరహాలు, రేణం శ్రీను తదితరులు తాము సాగు చేస్తున్న భూములోకి కత్తులతో వచ్చి చెట్లను నరికివేశారని బాధిత రైతులు ఆది ఏసు, శ్రీను, ఎన్. త్రినాథ్, శ్రీదేవి, ఎ.వరలక్ష్మి, నేమాల శ్రీను, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే.. ఎల్.సింగవరానికి చెందిన వేపాడ మధు తమ రెవెన్యూ పరిధిలోని బంజరును స్థానికులకు పంపిణీకి వెళ్లగా, తమపై ఆది శ్రీను, ఏసు తదితరులు 15 మంది దాడి చేసి గాయపరిచినట్టు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాల ఫిర్యాదులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్‌ఐ ఈశ్వరరావు తెలిపారు.

టీడీపీ ఖండన

తెలుగుదేశం పార్టీకి చెందిన వేపాడ మధుపై కొండెంపూడికి చెందిన పలువురు వైసీపీకి చెందిన కార్యకర్తలు దాడి చేయడాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, నాయకుడు దొంకిన అప్పలనాయుడు ఖండించారు. వారు విలేకరులతో మాట్లాడుతూ, ఎల్.సింగవరం రెవెన్యూ పరిధిలోని బంజర్ల భూమిని అర్హులకు అందజేయాలనే సదుద్దేశంతో వెళ్లిన మధుపై వైసీపీకి చెందిన సాగు రైతులు దాడి చేయడం సరికాదన్నారు.

పవర్ ప్లాంట్‌పై కొనసాగుతున్న నిరసనలు

» సర్వే మధ్యలో నిలిపి వెనుతిరిగిన సిబ్బంది


హైడ్రో ప్లాంట్ నిర్మాణాన్ని వ్యతి రేకిస్తున్న గిరిజనులు

దేవరాపల్లి, ఆగస్టు 9: అదానీ కంపెనీకి చెందిన హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వే, మట్టి నమూనాలకు సేకరణకు వచ్చిన సిబ్బంది సరియానగరం పాలెంలో గిరిజనులు అడ్డుకోనున్నట్టు ముందస్తు సమాచారంతో శుక్రవారం మధ్యలోనే వెనుతిరిగి వెళ్లిపోయారు. మండలంలోని వాలాబు పంచాయతీ శివారు నగరంపాలెం, అనంతగిరి మండలం సరియా జలపాతం వద్ద అదానీ కంపెనీ పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వేలు చేపట్టింది. ఈ మేరకు అటవీశాఖ అధికారులు, అదానీ కంపెనీ సిబ్బంది దేవరాపల్లి నుంచి వెళ్లడానికి అనంతగిరి పోలీసులతో సమావేశమయ్యారు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి. దొర ఆధ్వర్యంలో ముందస్తు సమాచారంతో నగరం పాలెం వద్ద గిరిజనులు నిరసన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు, అదానీ కంపెనీ సిబ్బంది పోలీసుల సూచనలతో దేవరాపల్లి నుంచి వెనుతిరిగి వెళ్లి పోయారు. ఈసందర్భంగా వెంకన్న మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులు జరగాలంటే గ్రామ సభలో అనుమతి కావాల్సి ఉం టుందన్నారు. చట్టాలను అతిక్రమించి అదానీ కంపెనీకి ప్రభుత్వం ఇక్కడి భూములను తాకట్టు పెట్టిందా.. అని ప్రశ్నించారు. ఇక్కడ పవర్ ప్రాజెక్టు పనులు చేపడితే ప్రత్యక్షంగా పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు.

కాలుష్యంపై కన్నెర్ర

» పోర్టులో కాలుష్యం తగ్గించాల్సిందే

» అచ్యుతాపురం సెజ్‌లో వసంత్ కెమికల్స్‌లో ప్రమాదంపై విచారణ

» పరవాడ రాంకీ ఫార్మా సిటీ చుట్టుపక్కల ద్రవ వ్యర్థాలపై పారబోతపై దృష్టి

విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలో కాలుష్యం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించడంతో కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అప్రమత్తమైంది. నగరంతోపాటు పరిసరాల్లో ప్రతి పరిశ్రమలో కాలుష్య ఆడిట్ నిర్వహిస్తామని మంత్రి చెప్పడంతో అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. కాలుష్యం తగ్గించేందుకు చర్యలు తగిన చేపట్టాల్సిందిగా విశాఖ పోర్టు అధికారులను పీసీబీ ఆదేశించింది. విజయవాడలోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో శుక్రవారం విశాఖ పోర్టు అధికారులు, మరికొన్ని పరిశ్రమల ప్రతినిధులతో లీగల్ హియరింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టు నుంచి వెలువడుతున్న ధూళి తీవ్రతను పీసీబీ అధికారులు ప్రస్తావించారు. ప్రతి రోజు పోర్టు పరిసరాల్లో స్ప్రింక్లర్లతో నీటిని స్ప్రే చేయాలని, బొగ్గు రవాణా సమయంలో ధూళి వెలువడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అచ్యుతాపురం సెజ్‌లోని వసంత్ కెమికల్స్‌లో గత నెలలో జరిగిన ప్రమాదంపై పీసీబీ విచారణ చేపట్టింది. అచ్యుతాపురం సెజ్ నుంచి వ్యర్థాలు బయటకు వస్తున్నట్టు ఆరోపణ వస్తున్నందున ప్రధాన ద్వారం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు, చెక్‌పోస్టు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు.

గత నెలలో పెదగంట్యాడ మండలం గంగవరం సమీపంలో సముద్రానికి వెళ్లే కాలువలో ద్రవ వ్యర్థాలు పారబోసేందుకు యత్నించగా పీసీబీ అధికారులు పట్టుకున్నారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు, దాని మూలాల కోసం రాంకీ ఫార్మాసిటీలో కెమికల్స్ ఉత్పత్తి చేసే కంపెనీలపై దృష్టిపెట్టాలని నిర్ణయించారు. అలాగే పరవాడ మండలం పెద ముషిడివాడలో ద్రవ వ్యర్థాలు పారబోసిన వ్యవహారంపై పోలీసుల నుంచి విచారణ నివేదిక తీసుకుని దాని ప్రకారం చర్యలు తీసుకోవాలని పీసీబీ నిర్ణయించింది.

బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షునికి సత్కారం


రామచంద్రయాదవ్‌కు పుష్పగుచ్ఛాలను అందిస్తున్న యువకులు

కొత్తూరు, ఆగస్టు 9 : భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్‌ను అనకాపల్లి నాయకులు, కార్యకర్తలు ఇక్కడ సత్కరించారు. విజయనగరం వెళ్తున్న ఆయనను బైపాస్‌లో మొల్లి శ్రీను, దివాకర్, గుణయాదవ్, రాముయాదవ్, పల్లా కృష్ణ, బాలు, పండు, ఉదయ్, మహేష్ కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

సీఎం చంద్రబాబును కలిసిన 'బుద్ద'

అనకాపల్లి, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి నిర్ణయంపై శుక్రవారం అమరావతిలోని ఉండవల్లిలో టీడీపీ జిల్లా నాయకులతో సమావేశం ఏర్పాటైంది. ఈ సందర్భంగా చంద్రబాబును మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, బత్తుల తాతయ్యబాబు కలిశారు.

ఒకటి నుంచి హెల్మెట్ తప్పనిసరి

» వాహన చోదకుడితోపాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా ధరించాలి

» లేనిపక్షంలో మూడు నెలలు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెన్షన్, రూ.1,035 జరిమానా

విశాఖపట్నం, ఆగస్టు 9: ద్విచక్ర వాహన చోదకుడితోపాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి తప్పనిసరిగా హెల్మెట్ (బీఐఎస్ మార్క్) ధరించాలని విశాఖ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో కోరారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అమలు చేయడం జరుగుతుందన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడపడం ప్రాణాంతకమన్నారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తికి జరిమానా విధించడంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను మూడు నెలలు సస్పెండ్ చేయడం జరుగుతుందన్నారు. వాహనం నడిపే వ్యక్తి, వెనుకకూర్చున్న వ్యక్తి..ఇద్దరిలో ఏఒక్కరు హెల్మెట్ ధరించకపోయినా రూ.1,035 జరిమానా విధించనున్నట్టు ఆ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలందరూ గమనించి హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే బీఐఎస్ మార్క్ స్టాండర్డ్ లేని హెల్మెట్‌ల అమ్మకందారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

అవినీతిరహితంగా కేజీహెచ్‌ను తీర్చిదిద్దుతాం

» కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు

» సూపరింటెండెంట్ శివానంద


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ శివానంద, ఆర్‌ఎంవో

మహారాణిపేట,ఆగస్టు 9: కేజీహెచ్‌లో అవినీతి, లంచాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని పేరొందిన కేజీహెచ్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వైద్యులు, రోగుల మధ్య అనుబంధం పెంపొందేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు.

ఫిర్యాదుకు ఫోన్ నెంబర్లు ఇవీ..

రోగులు ఆస్పతిలో పడుతున్న ఇబ్బందులపై ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిపై కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఫోన్: 0891-2590100, 0891-2589102 నంబర్లకు సమాచారమిస్తే, అందుకు బాధ్యులపై వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేజీహెచ్‌లో జనన, మరణ ధ్రువ పత్రాలు జారీ విధానాన్ని క్రమబద్ధీకరిస్తున్నామన్నారు. కేజీహెచ్‌లో మహా ప్రస్థానం వాహనాల వివరాలు అందరికీ తెలిసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. క్యాజువాలిటీ వార్డు నిర్వహణలో మరిన్ని సం స్కరణలు తీసుకురానున్నట్టు చెప్పారు. ఆసుపత్రిలో వాహనాల రా కపోకలపై కఠిన నిబంధనలు అమలు చేస్తామని చెప్పారు. పోస్టరు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్‌ఎంవో దవళ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ శోభ

» నూకాంబిక ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు


నూకాంబిక ఆలయంలో వరలక్ష్మి వ్రతాలు చేస్తున్న మహిళలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 9 : శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా అమ్మవార్ల ఆలయాల్లో భక్తుల కోలాహలం నెలకొంది. ఇక్కడి నూకాంబిక అమ్మవారి బాలాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మాసంలోని నాలుగు శుక్రవారాలు ఆలయంలో ఉచితంగా ఈ వ్రతాలు జరుపుతామని ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. ఇదిలావుండగా గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ ఆలయం, కామాక్షిదేవి ఆలయం, సంతోషిమాత ఆలయం, గౌరీపంచాయతన ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో వేకువజాము నుంచి విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

సోమలింగేశ్వర ఆలయ షాపులు అద్దెకు వేలం

సబ్బవరం, ఆగస్టు 9 : మండలంలోని బంగారమ్మపాలెం పంచాయతీ లింగాలతిరుగుడు సోమలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన నాలుగు షాపులను మూడేళ్ల కాల వ్యవధికి లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 14న ఆలయం వద్ద బహిరంగ వేలం పాట నిర్వహించనున్నామని ఆలయ ఈవో కీర్తి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు రూ.ఐదు వేలు ప్రథమ దరావతు చెల్లించి పాటలో పాల్గొనవచ్చునని వివరించారు. పాట ఖరారైన వెంటనే పన్నెండు నెలల అద్దెను సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు

కొత్తూరు, ఆగస్టు 9 : గురు పూజోత్సవం సెప్టెంబరు 5న జరగనున్న సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ ఏపీ మోడల్ స్కూల్, ఏపీఆర్ఎస్, ఎయిడెడ్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం ఆమె కోరారు. దరఖాస్తులను, వాటికి సంబంధించిన ఆధారాలతో మండల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సంబంధిత ఎంఈవోలకు, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఎలమంచిలి ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాల్సిందిగా ఆమె సూచించారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు పునఃసమీక్షించాలి

» జిల్లా మాలమహానాడు కార్యవర్గం డిమాండ్


మాలమహానాడు సమావేశంలో పాల్గొన్న కార్యవర్గం సభ్యులు

కొత్తూరు, ఆగస్టు 9: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని అనకాపల్లి జిల్లా మాలమహానాడు కార్యవర్గం డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక నర్సింగరావుపేటలో ఉన్న కార్యాలయంలో కార్యవర్గ సభ్యులంతా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులు పావాడ సన్యాసిరావు, గోడి వెంకటేశ్వరరావు, గుడాల తాతబాబు, నర్సీపట్నం నుంచి అప్పలరాజు, రేబాక మధు, బోని గణేష్ తదితరులు మాట్లాడారు. సుప్రీంకోర్టు వర్గీకరణపై పలు రకాల తీర్పులు ఇవ్వడంపై అనుమానాలు ఉన్నాయన్నారు. ఇదే సుప్రీంకోర్టు గత నెల జూలైలో బీహార్ ప్రభుత్వానికి రిజర్వేషన్‌పై నిర్ణయం తీసుకోవడానికి అధికారం లేదని చెప్పి, ఎస్సీ వర్గీకరణపై మాత్రం భిన్నమైన తీర్పు ఇవ్వడం శోచనీయమని వారు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో క్రిమిలేయర్ అంశం చేర్చడం రాజ్యాంగ విరుద్ధంగా ఉందని వాపోయారు. న్యాయ పోరాటంతో పాటు ప్రజా పోరాటాల ద్వారా వర్గీకరణ అడ్డుకుంటామని తెలిపారు. క్రిమిలేయర్ వలన మొత్తం దళిత జాతి అధోగతపాలు చేసిన మందకృష్ణ కుట్రను దళితులు అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో దొమ్మేసి సత్యారావు, మైలపల్లి నాగేశ్వరరావు, వాడల సంజీవ్, కసిపల్లి మానిరాజు, గోనూరు రాజీ తదితరులు పాల్గొన్నారు.

12 మద్యం బాటిళ్లతో వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 9 : ఇక్కడి సబ్బవరం రోడ్డులో శుక్ర వారం ఒక వ్యక్తి నుంచి 12 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ బి.రామకృష్ణ తెలిపారు. అనకాపల్లి మండలం కోడూరుకు చెందిన సేనాపతి రమణ పట్టణంలోని మద్యం దుకాణాల్లో మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి స్వగ్రామం వెళ్లేందుకు పాత గోపాలకృష్ణ థియేటర్ వద్ద ఆటో కోసం వేచి ఉన్నాడన్నారు. విజుబుల్ పోలీసింగ్‌లో భాగంగా అనుమానం వచ్చి తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు బయటపడినట్టు చెప్పారు. అనంతరం అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

ఒకే ఈతలో రెండు దూడలు

అనకాపల్లి జిల్లా చోడవరం మండలం అడ్డూరు గ్రామంలో ఓ ఆవు ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. గ్రామానికి చెందిన ఎలమంచిలి చినరామునాయుడుకు చెందిన ఆవు శుక్రవారం రెండింటిని ఈనింది. ఇందులో ఒకటి ఆడది (పెయ్య) కాగా... మరొకటి మగది.

\- చోడవరం


ఆవు, దూడలు


పాడేరులో చీరలు అందజేస్తున్న టీడీపీ నేత నాగరాజు


జీకే వీధిలో మాట్లాడుతున్న ఉద్యోగ సంఘాల నేతలు


అనంతగిరి : వేడుకలో థింసా సందడి


హుకుంపేటలో తుడుం వాయిస్తూ..


కొయ్యూరు : నడింపాలెంలో గాం గంటందొర, మల్లుదొర, అల్లూరి విగ్రహాలకు నివాళి..

ఆదివాసీ సంస్కృతీసంప్రదాయాలు ఆదర్శనీయం

- జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్
- సందడిగా ఆదివాసీ దినోత్సవం
- వాడవాడలా ఆటపాటలు, థింసా నృత్యాలు, సంప్రదాయ వాయిద్యాలతో మారుమోగిన ఏజెన్సీ ప్రాంతం
- ఆదివాసీల ఐక్య పోరాటాలకు పలు గిరిజన సంఘాల నేతలు పిలుపు

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేళ అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని, హక్కులను కాపాడుకోవాలని పలువురు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వాడవాడలా గిరిజన సంప్రదాయ రీతులు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల గిరిజన నేతల వేషధారణలో అలరించారు. ప్రతిచోట థింసా నృత్యం, తుడుము చప్పులు, ఆటపాటలతో గిరిజన ప్రాంతం మారుమోగింది. ఆ సంబరాల్లో పెద్ద ఎత్తున గిరిజనులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ డాక్టర్ అభిషేక్ గౌడ్


సభకు తరలివచ్చిన వివిధ వర్గాల ఆదివాసీలు

చింతపల్లి, ఆగస్టు 9 : ఆదివాసీ సంస్కృతిసంప్రదాయాలను పరిరక్షించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ మైదానంలో జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత సంతబయలు నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు విద్యార్థులు, గిరిజన సంఘాల నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన జీవనం నిష్కల్మషంగా ఉంటుందన్నారు. ఆదివాసీలంటే మూలవాసులని, ఆదివాసీలు ప్రకృతి ప్రేమికులు అన్నారు. ఆదివాసీల వల్ల ఎన్నో వనరులు సంరక్షించబడుతున్నాయన్నారు. గిరిజనుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఆ అవకాశాలను వినియోగించుకొని గిరిజనులు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. వ్యాపార రంగంలో కూడా రాణించి ఆర్థికంగా ఎదగాలన్నారు. ఇందుకోసం ప్రధానంగా గిరిజన ప్రాంతంలో పని చేసే ఉపాధ్యాయులు ప్రధాన భూమిక పోషించాలన్నారు.

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి తమర్భ బాబూరావునాయుడు మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, చట్టాలను పరిరక్షించుకునేందుకు ప్రతి ఒకరూ ఐక్యతగా ముందుకుసాగాలన్నారు. గిరిజనులు, విద్యార్థులు గిరిజన చట్టాలు, హక్కులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరాబు సత్యనారాయణ మాట్లాడుతూ జీవోనంబరు-3ను సాధించుకునేందుకు ఆదివాసీలు ఐక్యతగా పోరాటం చేయాలన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని 150 మంది గిరిజన యువత రక్తదానం చేశారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యూవీ గిరి, జిల్లా సంయుక్త కార్యదర్శి గెమ్మెలి మోహన్‌రావు, మండలాధ్యక్షుడు బౌడు గంగరాజు, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు గిడ్డివరలక్ష్మి, నాయకులు దేపూరి శశికుమార్, గెమ్మెలి కామేశ్, తహసీల్దార్ టి.రామకృష్ణ, ఎంఈవో-1,2 పనసల ప్రసాద్, గెమ్మెలి బోడంనాయుడు పాల్గొన్నారు.

అనంతగిరి : మండల కేంద్రంలోని గిరిజన సంఘం ఆధ్వర్యంలోని ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ.. ఆదివాసీ హక్కులు చట్టాలు కాపాడుకున్నపుడే నిజమైన ఆదివాసీ దినోత్సవమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులు థింసా నృత్యాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలోని జడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ రూతు, ఏటీడబ్ల్యూవో వెంకటరమణ, ఎంఈవో బాలజీ, వైద్యాధికారులు మంజుభార్గవి, గణేశ్వరరావు,హెచ్‌ఎంలు మంగమ్మ, అప్పలస్వామి, మల్లేశ్వరరావు, భాస్కరరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట : అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు గిరిజన సంప్రదాయాలతో తుడుములు వాయించి మహిళలు సైతం నృత్యాలు చేశారు. కామయ్యపేట జంక్షన్ వద్ద ఉన్న మర్రి కామయ్య విగ్రహానికి పూలమాల వేసి 'జోహర్ ఆదివాసీలు' అంటూ నినదించారు. అనంతరం పలు ఆదివాసీ సంఘాల నేతలు, వివిధ పార్టీల నాయకులు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద సభ నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. అలాగే మండలంలోని 33 పంచాయతీల్లోని 360 గిరిజన గ్రామాల్లోనూ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాలు నేతలు, ఉద్యోగులు, పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండల వ్యాప్తంగా శుక్రవారం గిరిజన ఉద్యోగులు, ఉపాధ్యాయ, విద్యార్థి, ఉద్యోగ సంఘాలతో పాటు ఆదివాసీ జేఏసీ, అన్ని రాజకీయ పార్టీల నేతల ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల ఆదివాసీల వేషధారణలు అలరించారు. కొయ్యూరులో అంబేడ్కర్, అల్లూరి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జెండా ఆవిష్కరించారు. అల్లూరి పార్కు నుంచి సంప్రదాయ నృత్యాలతో ర్యాలీ నిర్వహించి స్థానిక అల్లూరి కళామందిరం ఆవరణలో సభ నిర్వహించారు. నడింపాలెంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించి కూడలిలో గల గాం గంటం దొర, మల్లుదొర, అల్లూరి విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆదివాసీ జెండా ఆవిష్కరించారు. అలాగే శరభన్నపాలెంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. బూదరాళ్ళ పంచాయతీ ముకుడుపల్లిలో మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, యువతకు వాలీబాల్ కిట్‌లను ఎస్ఐ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆదివాసీ జేఏసీ నేతలు పాడి లోవరాజు, మాకాడ బూర్గులయ్య, పుల్లయ్య, సన్యాసిరావు, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నేతలు సీదరి సన్యాసిరావు, నర్సు పాపారావు, చుంద్రు కృష్ణ, అంబటి నూకరాజు,ఫణీంద్ర, గిరిజన సంఘం జిల్లా నేత ఎస్.సూరిబాబు, టీడీపీ, బీజేపీ జనసేన, సీపీఐ, సీపీఎంలకు చెందిన నేతలు అల్లూరి సీతారామరాజు గిరిజన సంక్షేమ సేవ సంఘం ప్రతినిధులు విద్యార్థి సంఘాల నేతలు, పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురష్కరించుకొని స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లు వెంకటరమేశ్ నాయుడు కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు జీవో 275ను అమలు చేసి గిరిజనులకు ఉద్యోగాలు కల్పించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, నాయకులు ఎస్.నాగబ్బాయి, ఎం.మత్స్యరాజు, శ్రీను, పిన్నయ్యదొర, భీంబాబు, సింహాచలం, అప్పారావు, రామకృష్ణ, రామారావు, కొండబాబు, నితిన్‌కుమార్, వరప్రసాద్, సన్నిబాబు, కొండలరావు, బాబూరావు, రామన్న, ఎస్.కొండలరావు పాల్గొన్నారు.

పాడేరు రూరల్ : ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను మండలంలో శుక్రవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ప్రపంచఆదివాసీ దినోత్సవం సందర్భంగా టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి స్వగృహం కుమ్మరిపుట్టులో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు మాట్లాడుతూ..గిరిజన ప్రాంత ప్రజాప్రతినిధులు పార్టీల కంటే ఆదిమజాతి అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతను ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు చల్లంగి లక్ష్మణరావు, జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు. అలాగే బొర్రా నాగరాజు కార్యాలయంలో తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఆదివాసీ మహిళలకు నాగరాజు చీరలు పంపిణీ చేశారు. అలాగే గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీఎంఆర్సీ కాలనీలోని గిరిజన సంఘం కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మానపడాల్ పతాకావిష్కరించారు. గిరిజన సంఘం నాయకులు వి.హారేంద్ర దాస్, వరహాలబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు చిన్నారావు పాల్గొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు సొనాయి గంగరాజు ఆధ్వర్యంలో మండలంలోని వంజంగిపంచాయతీ దొడ్డిపల్లి గ్రామంలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు వసంత, మంగవేణి, అప్పలమ్మ, వరలక్ష్మి, నాగమ్మ పాల్గొన్నారు. పాడేరులో ఏపీ ఆదివాసీ వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు అడపా బొంజునాయుడు ఆధ్వర్యంలో ఆదివాసీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికాస్ పరిషత్ నాయకులు ఎ.నాగంనాయుడు, కె.సింహాద్రి, కె.పరమేశ్వరరావు, పి.చందరరావు తదితరులు పాల్గొన్నారు.


జి.మాడుగుల : కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

గూడెంకొత్తవీధి : మండల కేంద్రంలో శుక్రవారం ఆదివాసీ జేఏసీ, గిరిజన ఉద్యోగుల సంఘం సంయుక్తంగా ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఆదివాసీ జెండాను డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో వక్తలు ఆదివాసీ హక్కులు, చట్టాలను వివరించారు. గిరిజన చట్టాలు, హక్కులను కాపాడుకునేందుకు ఐక్యతగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గిరిజన గాయకుడు దుడ్డు సత్యనారాయణ స్వరపరిచిన 12వ ఆదివాసీ గీతాన్ని సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు లోచలి రామకృష్ణ, రామరాజు, పెద్దబ్బాయి, బలరామ్, జేఏసీ నాయకులు మొట్టడం, రాజబాబు, బలరామ్, రామచంద్రుడు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, అశోక్ కుమార్, ఎస్సై అప్పలసూరి, ఎంఈవో-1,2 సత్యనారాయణ, రామన్న, ఏవో మధుసూదనరావు, పలువురు సర్పంచ్‌లు, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణకు అందరి సహకారం అవసరం

- తహసీల్దార్ రామకృష్ణ


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

చింతపల్లి, ఆగస్టు 9 : బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒకరు బాధ్యతగా సహకరించాలని మండల స్థాయి బాల్య వివాహాల నిషేధ, పర్యవేక్షణ కమిటీ చైర్మన్, తహసీల్దార్ టి.రామకృష్ణ అన్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ అధికారులతో కలిసి అవగాహన సదస్సుర్యాలీ నిర్వహించారు. అంతకుముందు మండల స్థాయి బాల్య వివాహాల నిషేధ, పర్యవేక్షణ కమిటీని ఏర్పా టు చేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎక్కడైనా బాల్యవివాహాలు నిర్వహిస్తే ఐసీడీఎస్, మహిళా కానిస్టేబుల్, పోలీసు, ఎన్‌జీవో, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో జీవీ రమణ, ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు విజయకుమారి, సత్యవతి, గౌరి, అప్పలనర్సమ్మ, ఎస్సై వెంకటరమణ, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, హెచ్‌డబ్ల్యూవో వసంతపాల్గొన్నారు

317 మందికి క్యాన్సర్ వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అరకులోయ, ఆగస్టు 9 : అరకులోయ ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో గురు, శుక్రవారాల్లో నిర్వహించి క్యాన్సర్ స్ర్కీనింగ్ క్యాంపునకు స్థానికుల నుంచి స్పందన లభించింది. 317 పరీక్షలు చేయించుకున్నారు. ఈ రెండు రోజులు అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రిలో ఆస్పత్రి ఇన్‌చార్జి ఎల్.రాము ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమన్వయాధికారి డాక్టర్ కృష్ణారావు, డాక్టర్లు నాగమణి కంఠ, గౌతం పాల్గొన్నారు. ఈ క్యాన్సర్ స్ర్కీనింగ్ క్యాంప్‌లను వైయస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో నిర్వహించారు.

కొనసాగుతున్న పోలీసుల నిఘా

- సీపీఐ మావోయిస్టుల కదలికలపై సమాచారం రావడంతో అప్రమత్తం



చింతపల్లి, ఆగస్టు 9 : మావోయిస్టుల వారోత్సవాలు ముగిసినప్పటికీ పోలీసుల నిఘా కొనసాగుతోంది. ప్రధాన కేంద్రాల్లో గాలింపు చర్యలు, తనిఖీలను ముమ్మరం చేశారు. శుక్రవారం స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రమేశ్ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు, బాంబ్ స్క్వాడ్ బృందాలు హనుమాన్ జంక్షన్‌లో తనిఖీలు నిర్వహించాయి. గిరిజన ప్రాంతంలో సీపీఐ మావోయిస్టుల యాక్షన్ టీం సభ్యులు సంచరిస్తున్నట్టు పోలీసు నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో జిల్లా పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. వారోత్సవాలు ముగిసినప్పటికి ప్రత్యేక పోలీసు బలగాలతో సరిహద్దు అడవులను జల్లెడ పడుతున్నారు. మరోవైపు ప్రధాన కేంద్రాల్లో 24 గంటలు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు ప్రధాన రహదారులు, కల్వర్టులు, బ్రిడ్జిల వద్ద బాంబ్ స్క్వాడ్ బృందాలు సోదాలు చేస్తున్నాయి.

ఇకపై కొండల్లోనూ విద్యుత్ కాంతులు

- స్టాండ్ సోలార్ సెట్ల పంపిణీ
- దేశంలోనే మొట్టమొదటి పైలెట్ ప్రాజెక్టుగా చింతూరు డివిజన్


స్టాండ్ సోలార్ సెట్‌ని ఆవిష్కరిస్తున్న ఏపీ ఈపీడీసీఎల్ రాజమండ్రి ఎస్ఈ కె.తిలక్‌కుమార్

చింతూరు, ఆగస్టు 9 : ఎక్కడో కొండలపై జీవనం సాగిస్తున్న కొండరెడ్ల ఆవాసాలు నేటికి చీకటిలో మగ్గుతున్న విషయం తెలిసిందే. అంతటి ఎత్తైన ప్రదేశాలకు విద్యుత్ సరఫరా లైన్లను ఏర్పాటు చేయలేకపోవడమే దీనికి కారణం. అయితే ఇకపై ఆ ఆవాసాలు కూడా విద్యుత్ కాంతులతో కళకళలాడనున్నాయి. ప్రధానమంత్రి జన్‌మన్ యోజన పథకంలో భాగంగా కొండరెడ్ల ఆవాసాలకు స్టాండ్ సోలార్ సెట్ల ద్వారా విద్యుత్ వెలుగులు కల్పించనున్నారు. దేశంలోనే మొట్టమొదటిగా మన రాష్ట్రం ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంది. ఇందులో భాగంగా ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్‌లోని చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి ఎస్ఈ తిలక్‌కుమార్‌లు 94 కొండరెడ్ల కుటుంబాలకు స్టాండ్ సోలార్ సెట్లను ఉచితంగా అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలిరోజు నలుగురు లబ్ధిదారులకు అందించగా, మిగిలినవి కొద్దిరోజుల్లోనే అందజేస్తామని ఎస్ఈ చెప్పారు. తర్వాత ఇదే తరహాలో రాష్ట్రంలోని విద్యుత్ సరఫరాలేని ప్రతి కొండరెడ్డి ఆవాసానికి ఈ పథకం వర్తించనుంది. పూర్తి సబ్సిడీతో ఒక్కో కుటుంబానికి రూ.50 వేల విలువగల సోలార్ సెట్‌ను అమర్చనున్నారు. ఈ సిస్టం ద్వారా ఐదు బల్బులు, ఒక ఫ్యాన్, ఒక ల్యాప్‌ట్యాప్, ఒక మొబైల్‌కు సరఫరా అందనుంది. ఈ కార్యక్రమంలో ఏడీఈ మలాకి, లైన్ ఇన్‌స్పెక్టర్ కె.గణేష్ పాల్గొన్నారు.

'మార్గదర్శి'తో విద్యార్థులకు కెరీర్ కౌన్సెలింగ్ : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : గిరిజన విద్యార్థుల కెరీర్‌ను మెరుగుపర్చేందుకు 'మార్గదర్శి' పేరిట ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్టు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. ఆదివాసీ దినోత్సవంలో భాగంగా మండలంలోని కాందమామిడి బాలికల ఆశ్రమ పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు వెళ్లాలన్నారు. ప్రతి అడుగు ఆత్మ విశ్వాసంతో వేయాలన్నారు. విద్యార్థుల కెరీర్‌ను మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు చేపడతామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వారంలో ఒక రోజు ఒక గంట విద్యార్థులతో పలువురు మెంటార్లు ఉంటూ విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన కల్పిస్తారన్నారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ.. విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవాటు చేసుకుని, లక్ష్యాన్ని సాధించేందుకు శ్రమించాలన్నారు. ఆశ్రమ పాఠశాల సందర్శనకు వచ్చిన కలెక్టర్ దినేశ్‌కుమార్, పీవో అభిషేక్‌లు బాలికలతో కలిసి థింసా నృత్యం చేశారు. అలాగే ఈ సందర్భంగా బాలికలు చేసిన నృత్య ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజనీ, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొలిక్కి వచ్చిన తహసీల్దార్ల పోస్టింగ్ వ్యవహారం

- ఎన్నికలకు ముందు స్థానాల్లోనే కొనసాగించాలని ఈసీ సూచన

పాడేరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికలకు ముందు జిల్లాలోని తహసీల్దార్లు ఎక్కడ పని చేశారో అక్కడే వారిని కొనసాగించాలని ఎన్నికల కమిషన్ జిల్లా కలెక్టర్‌కు సూచించింది. దీంతో సుమారు రెండు వారాలుగా పెండింగ్‌లో ఉన్న తహసీల్దార్ల పోస్టింగ్ వ్యవహారం ఒక కొలిక్కి వచ్చింది.

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని 22 మండలాలకు చెందిన తహసీల్దార్లను ఎన్నికలకు ముందు విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు బదిలీ చేశారు. ఎన్నికలు ముగియడం, కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో జూలై నెలాఖరులో ఎక్కడి తహసీల్దార్లను అక్కడికి తిరిగి పంపేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయా తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇచ్చే క్రమంలో స్వల్ప మార్పు చేస్తూ ప్రభుత్వం మరో ఉత్తర్వును జారీ చేసింది. ఎన్నికలకు ముందు పని చేసిన అసెంబ్లీ స్థానంలో కాకుండా జిల్లా యూనిట్‌గా తీసుకుని వేరే అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రమే తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది. దీంతో జిల్లాకు చెందిన విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పని చేస్తున్న తహసీల్దార్లు అక్కడ నుంచి రిలీవయ్యారు. అలాగే ఆయా ప్రాంతాలకు చెందిన ఈ జిల్లాలో పని చేస్తున్న తహసీల్దార్లు ఇక్కడ నుంచి రిలీవయ్యారు. దీంతో ఆయా జిల్లాలకు వెళ్లిన వారంతా విధుల్లో చేరారు. కానీ ఇతర జిల్లాల్లో పని చేసిన ఈ జిల్లాకు చెందిన తహసీల్దార్లకు పోస్టింగ్ ఇచ్చే క్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో వారి పోస్టింగ్‌లకు బ్రేక్ పడింది.

ఎన్నికల కమిషన్ సూచనతో ఊరట

రెండు వారాలుగా ఎదురు చూస్తున్న తహసీల్దార్ల పోస్టింగ్ వ్యవహారం ఎన్నికల కమిషన్ సూచనతో ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. ఎన్నికలకు ముందు జిల్లాలో ఎక్కడ పని చేసిన తహసీల్దార్లను తిరిగి అక్కడే నియమించాలని సూచించింది. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ జిల్లాకు చెందిన తహసీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీలు చేసే అవకాశం లేదని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. దీంతో సోమవారం జిల్లాలోని తహసీల్దార్లు వారి పాత స్థానాల్లో విధుల్లో చేరే అవకాశం ఉన్నది.

ఆదివాసీ రైతులకు వరం : చింతూరు డివిజనుకు 11 లిఫ్టు ఇరిగేషన్లు మంజూరు

చింతూరు, ఆగస్టు 9 : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదివాసీ రైతులకు వరం ప్రకటించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజనులోని చింతూరు కూనవరం వరరామచంద్రపురం, ఎటపాక మండలాలకు గాను 11 లిఫ్టు ఇరిగేషన్లను సీఎం చంద్రబాబునాయుడు మంజూరుచేశారు. ఈ విషయాన్ని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో శుక్రవారం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధి దృష్టిలో పెట్టుకొని పలు పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈమేరకు చింతూరు ఐటీడీఏ పరిధిలో ఉన్న ఆవశ్యకతలను పొందుపర్చుతూ సీఎం కార్యాలయానికి చింతూరు ఐటీడీఏ నివేదిక పంపించడం జరిగిందని పీవో తెలిపారు. ఇందులో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు చింతూరు ఐటీడీఏ పరిధిలోని రైతులకు రూ.2 కోట్ల నిధుల వ్యయంతో ఇరిగేషన్ ప్రాజెక్టులను మంజూరు చేశారన్నారు. దీంతో రెండు వేలమంది రైతులు లబ్ధి పొందే అవకాశం ఉందన్నారు. పోలవరం ముంపు పరిధి లేని గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. దీనివల్ల ఇప్పటివరకు ఏడాదిలో ఒకే పంటకు అవకాశం ఉన్న పొలాల్లో ఇకపై ఏడాదికి రెండు పంటలు సాగు చేసుకోనే అవకాశం కలిగింది.

పెదలోచలి హెచ్‌ఎం సస్పెన్షన్

- ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు
- విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు చర్యలు

జి.మాడుగుల, ఆగస్టు 9 : విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన పెదలోచలి ప్రధానోపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు పడింది. ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గత నెల 26న పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మండల పర్యటనలో భాగంగా పెదలోచలి ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అయితే అప్పటి జోరువానలకు కలెక్టర్ పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆశ్రమ విద్యార్థులు బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ పాఠశాలలో 138 మంది విద్యార్థులకు గాను 94 మంది మాత్రమే ఉండడంతో తనిఖీకి వచ్చిన పీవో ఆగ్రహించారు. దీంతో రెండు వారాల తరువాత శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం ధర్మేంద్రను సస్పెండ్ చేసి, మరో ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

సంక్షిప్తంగా..

అల్లూరికి ఎస్పీ అమిత్ నివాళి


నివాళి అర్పిస్తున్న ఎస్పీ అమిత్

పాడేరు రూరల్, ఆగస్టు 9 : గిరిజన ప్రాంత యువత చక్కగా విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి, దేశానికి సేవ చేసే విధంగా తయారుకావాలని జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ సూచించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా కార్యాలయంలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ ఎల్.హిమగిరి, డీసీఆర్బీ సీఐ నారాయణరావు, ఎస్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ ఊచకోత దినంగా పాటించాలి

- బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా

కొయ్యూరు, ఆగస్టు 9 : వివిధ దేశాల్లో గిరిజనులు ఊచకోతకు గురైన నేపథ్యంలో ఆదివాసీ దినోత్సవానికి బదులుగా గిరిజనుల ఊచకోత సంతాప దినంగా పాటించాలని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో బీజేపీ నేతలతో కలసి బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమెరికా, యూరప్, ఆఫ్రికా, ఆసియాని వివిధ దేశాల్లో అత్యంత క్రూరంగా గిరిజనులు ఊచకోతకు గురయ్యారన్నారు. అటువంటి రోజును ప్రపంచ ఆదివాసీ దినోత్సవం అని పేరుపెట్టి సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పాడేరు అసెంబ్లీ కన్వీనర్ కృష్ణారావు, రాష్ట్ర ఎస్టీ మోర్చా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రరావు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ ఏఈఈగా వెంకటరమణ



పాడేరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ ఈపీడీసీఎల్ స్థానిక సెక్షన్ అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజనీరుగా ఎం.వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సుమారుగా ఏడాదిగా స్థానిక అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజనీరు పోస్టు ఖాళీగా ఉంది. దీంతో స్థానిక ఏడీఈ మల్లేశ్వరరావు ఇన్నాళ్లుగా ఏఈఈ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించారు. ఈక్రమంలో అనకాపల్లి జిల్లా యలమంచిలిలో పని చేస్తున్న ఏఈఈ ఎం.వెంకటరమణను ఇక్కడకు బదిలీ చేశారు. స్థానిక సెక్షన్ పరిధిలోని వినియోగదారులు నాణ్యమైన విద్యుత్ సేవలను అందించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో లైన్‌మన్ కొండలరావు, జూనియర్ లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వీసమామిడిలో మాస్ ప్లాంటేషన్


మొక్కలు నాటుతున్న ఉపాధి పథకం అధికారులు

పాడేరు రూరల్, ఆగస్టు 9 : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురష్కరించుకొని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులు శుక్రవారం వంతాడపల్లి పంచాయతీ వీసమామిడి గ్రామంలో 15 మంది రైతులకు సంబంధించిన 10,500 మొక్కలను నాటి ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఈజీఎస్ ఇన్‌చార్జ్ పీడీ కె.శ్రీనివాస నాయుడు మాట్లాడుతూ..గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలను సరఫరా చేసి ప్లాంటేషన్ చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఆర్‌వీఎస్.రమేష్, ప్లాంటేషన్ మేనేజర్ వి.కెజియ, ఏపీవో వై.వెంకటరమణ, ఈసీ జి.కృష్ణ, ఫాంటేషన్ సూపర్‌వైజర్ ఎ.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సందర్శించిన ఏడీఎంవో

సీలేరు, ఆగస్టు 9 : సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీ పరిధిలో నమోదైన మలేరియా కేసుల వివరాలను ఆరా తీశారు. జ్వర పీడితులకు మలేరియా పరీక్షలను నిర్వహిస్తున్న తీరుపై ల్యాబ్ టెక్నీషియన్‌తో మాట్లాడారు. సీలేరు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీలేరులో ఇంటింట సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి కన్నబాబు, ఆరోగ్య విస్తరణాధికారి జోజిబాబుపాల్గొన్నారు.

1,936 ఎకరాల్లో ఉద్యాన పంటలు : ఏపీవో

చింతపల్లి, ఆగస్టు 9 : మండలంలోని 1,936 ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగు చేస్తున్నట్టు స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కొక్కుల లక్ష్మీనారాయణ అన్నారు.శుక్రవారం మండలంలోని అంతర్ల గ్రామంలో గిరిజన రైతుల పంట పొలాల్లో ఉద్యాన పంటల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయికి ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నదన్నారు. ప్రధానంగా గిరిజన రైతుల ఆర్థిక ప్రగతి లక్ష్యంగా అవకాడో, డ్రాగన్‌ఫ్రూట్, సపోట, తీపి నారింజ, సీతాఫలం, నిమ్మ, జీడిమామిడి, మునగ, జాఫ్రా మొక్కలను రైతులకు ఉపాధి హామి పథకం ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈమొక్కలను సంరక్షించేందుకు మూడేళ్లపాటూ నిర్వాహణ ఖర్చులు అందజేయడం జరుగుతుందన్నారు. అంతర పంటలు సాగు చేసుకునే రైతులకు అదనంగా నగదు ప్రోత్సాహాలు అందుతాయన్నారు. ఈకార్యక్రమంలో ఈసీ మధుసుదన్, పీఎస్ పుష్కర్‌రావు, టీఏ బాలకృష్ణ పాల్గొన్నారు.

మాస్ ప్లాంటేషన్ లో 32,800 మొక్కలు

కొయ్యూరు, ఆగస్టు 9 : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించి మండల ంలో గల 33 పంచాయతీల పరిధి గ్రామాలలో మాస్ ప్లాంటేషన్(హార్టీకల్చర్) ప్రోగ్రాం కింద శుక్రవారం 32,800 మొక్కలు నాటినట్టు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు.